
సాక్షి
అనంతపురం

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.29 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.29 వేలు పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
36.8°/ 16.3°

జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేకువజామున చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులకు సూచనలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (వైఎస్సార్, అనంతపురం, కర్నూలు) నియోజకవర్గ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జేసీ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. బ్యాలెట బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, ఓట్ల లెక్కింపునకు గదుల ఎంపిక చేసేందుకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డితో కలిసి జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలను ముందుస్తుగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, వాహనాల పార్కింగ్‌కు స్థలం ఎంపిక చేసి బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. వీడియోగ్రఫీనీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహీల్దార్ శ్రీధర్ మూర్తి, వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిన్నారిని మింగిన నీటి తొట్టె



జెస్సికా (ఫైల్)

పామిడి: తొట్టెలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటున్న చిన్నారి అదుపుతప్పి నీటిలో పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందింది. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చింది. ఈ విషాద ఘటన పి.కొండాపురంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పి.కొండాపురంలోని జంగాలకాలనీలో ఆశీర్వాదం, దయామణి దంపతుల ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. బుధవారం దయామణి ఇంటి బయట దుస్తులు ఉతికే పనిలో నిమగ్నమైంది. ఆడుకుంటున్న కుమార్తె జెస్సికా (18 నెలలు) బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. అక్కడ నీటితొట్టెలో తన ప్రతిబింబాన్ని చూసుకునే క్రమంలో పట్టుతప్పి నీటిలో పడిపోయింది. కుమార్తె కనిపించకపోయేసరికి దయామణి వెతుక్కుంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. అక్కడ విగతజీవిగా పడి ఉన్న జెస్సికాను చూసి గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటనలో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తుకు గతంలో ఈ నెల 8వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా దరఖాస్తుకు ఇబ్బందులు తలెత్తడంతో గడువు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు...ఎడిట్ చేసుకునేందుకు ఈ నెల 16, 17వ తేదీల్లో అవకాశం ఉంటుందన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రుద్రంపేట బైపాస్‌లో ఉన్న బెస్ట్ కేర్ ఆస్పత్రి, బళ్లారి బైపాస్ రోడ్డులోని సన్ రే ఆస్పత్రిలో ఉన్న స్కానింగ్ కేంద్రాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి దొర బుధవారం తనిఖీ చేశారు. నిబంధనల మేరకు స్కానింగ్ చేయాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముప్పు తప్పినట్టే



కోవిడ్‌పై ఏపీ సర్కార్ విజయం సాధించింది. రెండో వేవ్‌లో వేగంగా ప్రాణాలు తీసిన మహమ్మారికి ప్రభుత్వం వ్యాక్సినేషన్ ద్వారా చెక్ పెట్టింది. క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ వ్యాక్సిన్ వేయడంతో రోగ నిరోధక శక్తి అమాంతం పెరిగింది. వైరస్‌ను తట్టుకునే స్థాయికి చేరుకోవడంతో ఆరు నెలల్లో ఒక్క కోవిడ్ కొత్త వేరియంట్ బీఎఫ్ 7 కేసు కూడా నమోదు కాలేదు. ప్రజలు ఊపిరి పీల్చుకుని.. తమ పనుల్లో నిమగ్నమైపోయారు.

- కోవిడ్‌పై పోరులో విజయం
- సత్ఫలితాలిచ్చిన వ్యాక్సినేషన్
- కనిపించని బీఎఫ్ 7 వేరియంట్
- గడిచిన వారంలో వంద శ్యాంపిళ్లు పరీక్షించినా జీరో కేసులు



వృద్ధురాలికి కోవిడ్ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు కోవిడ్ వ్యాక్సినేషన్ వివరాలు

మొదటి డోస్ వేసుకున్న వారి సంఖ్య
20,52,322

రెండో డోస్ వేసుకున్న వారి సంఖ్య
22,45,161

బూస్టర్ డోస్ వేసుకున్న వారి సంఖ్య
8,69,154

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు కోవిడ్ ముప్పు తప్పినట్టేనని వైద్య నిపుణులు భావిస్తున్నారు. కొన్ని నెలలుగా కోవిడ్ కేసులు నమోదు కాకపోవడమే దీనికి కారణమని చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఒక కేసు నమోదైంది. ఆ తర్వాత ఇప్పటి వరకూ అంటే ఫిబ్రవరి 8 వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి అనంతపురంతో సహా ఆరేడు జిల్లాల్లో జీరో కోవిడ్ పాజిటివిటీ నమోదైంది. అనుమానమున్న చోట టెస్టులు చేస్తున్నారు. కానీ ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదైన సందర్భాలు లేవు.

వారం రోజుల్లో వంద శ్యాంపిళ్లు

ఫిబ్రవరి ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జిల్లాలో 74 టెస్టులు ట్రూనాట్ పద్ధతిలోనూ, 26 టెస్టులు ఆర్టీపీసీఆర్ పద్ధతిలో చేశారు. కానీ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. నెల్లూరులో మాత్రం 1.06 పాజిటివిటీ రేటు నమోదైంది. పొరుగునే ఉన్న ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోనూ జీరో కేసులుగా ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 44 లక్షల జనాభా ఉండగా.. ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం చెప్పుకోదగ్గ అంశమని డాక్టర్లు అంటున్నారు.

బీఎఫ్ 7 ప్రభావం ఏమీ లేదు

ఇప్పటికీ చైనాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది కోవిడ్ వేరియంట్ బీఎఫ్ 7. కానీ ఇది మన దేశంలో పెద్ద ప్రభావమేమీ చూపించలేదు. అనంతపురం జిల్లాకు పొరుగునే బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. పలువురు విదేశాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. అయినా సరే జిల్లాలో ఎలాంటి కొత్త వేరియంట్‌లు కనిపించలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జినోమిక్ సర్వేలోనూ ఈ విషయం వెల్లడైంది. దేశంలోనే అత్యంత వేగంగా మన రాష్ట్రంలో ఇంటింటికీ వెళ్లి కోవిడ్ వ్యాక్సినేషన్ నిర్వహించడం వల్ల కేసులు నిరోధించడం సాధ్యమైందనేది కూడా మైక్రోబయాలజిస్టులు చెబుతున్నారు.

మెజారిటీ జనంలో ఇమ్యూనిటీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదటి, సెకండ్ వేవ్‌లో కరోనా విధ్వంసం సృష్టించిందనే చెప్పాలి. ముఖ్యంగా రెండో వేవ్‌లో డెల్టా వేరియంట్ కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. కానీ ఆ తర్వాత రాష్ట్రంలో కోవిడ్ వ్యాక్సిన్ యుద్ధప్రాతిపదికన చేపట్టడం ద్వారా మెజారిటీ జనంలో ఇమ్యూనిటీ (కోవిడ్‌ను తట్టుకునే వ్యాధినిరోధకత) వచ్చినట్టు తేలింది. హెల్త్ కేర్ వర్కర్లు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, 12 నుంచి 60 ఏళ్ల పైబడిన వారందరికీ క్షేత్రస్థాయిలో వ్యాక్సినేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణ వేరియంట్‌లు ఇప్పుడు ఎలాంటి ప్రభావమూ చూపలేవని, ఏదైనా బలమైన కొత్త వేరియంట్ వస్తే తప్ప ప్రస్తుతం ఉన్న కోవిడ్ వేరియంట్‌లు ఏమీ చేయలేవని చెబుతున్నారు.

వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి

ఉమ్మడి జిల్లాలో కోవిడ్ ముందస్తు చర్యల్లో భాగంగా వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేశాం. కోవిడ్‌పై భయాందోళన అవసరం లేదు. ఒక వేళ కోవిడ్ సోకినా చిన్నపాటి లక్షణాలే అయినందున ప్రాణహాని ఉండదు.

– డాక్టర్ యుగంధర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అనంతపురం

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు రూ.5,335 మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ చెప్పారు. శనగల కొనుగోలు అంశంపై సంబంధిత అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పప్పుశనగ పండించిన రైతులు తమ పేరును ఆర్‌బీకే ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ–క్రాప్‌లో నమోదై ఉండి సీఎంఏపీలో నమోదు చేయించుకున్న వారి నుంచి మాత్రమే పప్పుశనగ కొనుగోలు చేస్తారన్నారు. కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పప్పుశనగను అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పొడరాళ్ల, రెడ్డిపల్లి, గోవిందంపల్లి గ్రామాల్లో డీఏఓ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.5,335తో పప్పుశనగ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. విక్రయించదలచిన రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు పశువుల పెంపకం చేపడితే.. పాల ఉత్పత్తితో పాటు పంటలకు అవసరమైన ఎరువు లభిస్తుందన్నారు. అనంతరం రబీ ఈ క్రాప్ నమోదును డీఏఓ పరిశీలించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ఉపసర్పంచ్ లీలావతి, మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, ప్రవీణ్, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ చేయించుకోవాలి

గార్లదిన్నె: జిల్లా వ్యాప్తంగా రబీలో పంటలు సాగు చేసిన రైతులు కచ్చితంగా ఈ – క్రాప్ నమోదు, ఈ–కేవైసీ చేయించుకోవాలని డీఏఓ చంద్రానాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మంపేట, పాపినేపాళ్యం, శిరివరంలో రైతులు సాగు చేసిన పంటలు, ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, వీహెచ్‌ఏ గుల్ ఫరేషా, ఎంపీఈఓ లలిత, రైతులు పాల్గొన్నారు.

జేసీ సోదరులది నీచ బతుకు



పెద్దవడుగూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, చిత్రంలో పైలా, ఆలూరు సాంబశివారెడ్డి



బహిరంగ సభకు హాజరైన భారీ జనం

- ఇలాంటి గజ దొంగలను జైల్లో పెట్టాలి
- జేసీ ప్రభాకర్‌కు మతిభ్రమించింది
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం
- పెద్దవడుగూరు మండలంలో విజయవంతంగా ముగిసిన ప్రజా సంక్షేమ యాత్ర
- బహిరంగ సభకు తరలివచ్చిన భారీ జనం

పెద్దవడుగూరు : 'జేసీ సోదరులు దొంగ బస్సులు, లారీలు తిప్పుకుంటూ నీచమైన బతుకు బతుకున్నారు. ఇలాంటి గజ దొంగల ఫొటోలను పోలీస్, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అంటించనందునే తరచూ పోలీసుల మీదకు వస్తూ, పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వారిని పోలీసులు జైల్లో పెట్టాలి' అని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఆయన పెద్దవడుగూరు మండలంలో 11 రోజుల పాటు చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పెద్దవడుగూరులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలాది మందిని ఉద్దేశించి ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడారు. గతంలో జేసీ సోదరులు ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్నప్పటికీ పెద్దవడుగూరు మండలంలో రెండు పంటలకు నీరిచ్చిన పాపాన పోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడేళ్లుగా రెండు పంటలకు నీరిస్తున్నామని గుర్తు చేశారు. జేసీ బ్రదర్స్ తీరు అత్యంత హేయమని మండిపడ్డారు. ఎవరైనా ఖరీదైన దుస్తులు వేసుకుని వారికి ఎదురుగా ఉంటే ఇవి ఎక్కడ నుంచి వచ్చాయంటూ హేళన చేస్తారని, నియోజకవర్గంలో వారి వద్ద మాత్రమే డబ్బులున్నాయా? మరి ఎవరి వద్దా లేవా అని ప్రశ్నించారు. పోలీసులు గజ దొంగలైన జేసీ బ్రదర్స్‌ను వదిలేసి అమాయకులపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. రెవెన్యూ ఉద్యోగులను, పోలీసులను, అధికారులను బెదిరిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికైనా వెనుకాడబోనని స్పష్టం చేశారు. జేసీ దివాకర్ రెడ్డిపై కాల్‌మనీ కేసు నమోదు చేయడంతో పాటు డబ్బు విషయమై తాడిపత్రికి చెందిన కొందరిని తన ఇంట్లో ఉంచుకొని హింసించిన జేసీ ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలో 30 ఏళ్లుగా సాగిన జేసీ సోదరుల నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి అభినందనలు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎమ్మెల్యే పెద్దారెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక జేసీ ప్రభాకర్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికీ చేరుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే మన కుటుంబాలు బాగుంటాయని, లేకుంటే ఫ్యాక్షన్ గొడవల్లో తగలబడిపోతాయని హెచ్చరించారు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకొని ఓట్లు వేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకు కృష్ణా జలాలు అందించడానికి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన కృషిని వివరించారు. ఆ మహనీయుని అడుగుజాడల్లోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నడుస్తున్నారన్నారు. ప్రజల పక్షాన నిలిచి, అభివృద్ధి వైపు నడిపిస్తున్న వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్నవారికి, పేదవారికి మధ్య పోరాటం జరుగుతోందన్నారు. లేని వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరుస్తోందని, దీన్ని జీర్ణించుకోలేకనే టీడీపీ నేతలు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని విమర్శించారు.

పప్పుగాడు న్యాయం చేస్తాడా?



పప్పుధాన్యాలన్నీ తెచ్చి ముందు పెట్టి పేర్లు అడిగితే కరెక్ట్‌గా చెప్పలేని 'పప్పుగాడు' రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తాడా అని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. పాదయాత్ర చేస్తున్న ఆ ప్రబుద్ధుడు స్థాయి తెలుసుకొని ముఖ్యమంత్రి గురించి మాట్లాడితే బాగుంటుందని హితవు చెప్పారు. ఎవరో పెట్టిన పార్టీని లాక్కొని దొడ్డిదారిన మంత్రి పదవులు పొందిన మీరు మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తోందన్నారు. ఒంటరిగా నడవలేని స్థితిలో మరొకరితో పొత్తుపెట్టుకొని వచ్చే మీరెక్కడ.. సింహంలా ఒంటరిగా వస్తున్న వైఎస్సార్‌సీపీ ఎక్కడ.. ఈ విషయం తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌బాషా, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరబారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, కందిగోపుల మురళి, కంచం రామ్మోహన్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న డీఐజీ ఎం.రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈ నెల 11న నిర్వహించే లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులకు పరిష్కారానికి చొరవ చూపాలని పోలీసు అధికారులను అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలో పోలీసుల సంక్షేమ చర్యలపై సమీక్షించారు. శ్రీసత్యసాయి జిల్లాలో 10 వేలు, అనంతపురం జిల్లాలో 4,500 కేసులు ఉన్నాయని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసుల సంఖ్య తగ్గించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీలు ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్ పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు తర్వాతి పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీస్ లైబ్రరీలో శిక్షణ పొందుతున్న వారిలో 94 మంది అభ్యర్థులు రాత పరీక్షల్లో అర్హత సాధించినట్లు గుర్తు చేశారు. వీరికి ఫిజికల్ ఈవెంట్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు అర్హత సాధించి ఆసక్తి ఉన్న అభ్యర్థులకూ పోలీస్ పరేడ్ మైదానంలో 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ తదితర అంశాలపై ఉదయం, సాయంత్రం సుశిక్షితులైన సిబ్బందితో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి ప్రణాళిక ఖరారు



పనులు చేస్తున్న కూలీలు

- 1.41 కోట్ల పని దినాల లక్ష్యం

2023-24 ఆర్థిక సంవత్సరానికి 'ఉపాధి' ప్రణాళిక

జిల్లాలో జాబ్‌కార్డులు	3,45,332
పనిదినాల లక్ష్యం	1.41 కోట్లు
కూలీల సంఖ్య	4,79,255
రోజూ కూలి	రూ. 247
బడ్జెట్ అంచనా	రూ.699.06 కోట్లు
చేపట్టే పనుల రకాలు	96
మెటీరియల్ ఖర్చు	రూ.157.60 కోట్లు

రాయదుర్గం: ఉన్న ఊరిలోనే పని కల్పించే 'ఉపాధి హామీ పథకం' కూలీలకు వరంలా మారింది. పని దినాల కేటాయింపులో కేంద్రం కోత విధించినా.. లోటు రాకుండా సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లాలోని 31 మండలాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం (2023–24)లో చేపట్టాల్సిన పనుల ఎంపిక, పని దినాల ప్రక్రియ ఖరారైంది. 1.41 కోట్ల పని దినాలను లక్ష్యంగా నిర్దేశించింది. పనుల ఎంపికలోనూ పారదర్శకత పాటించింది. దీంతో చిన్నాచితక కాకుండా శాశ్వత పనుల ఎంపికపైనే దృష్టి సారించింది. వ్యవసాయ అనుబంధంగా ఉన్నవాటికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా రూపకల్పన చేసింది. పొలాలకు అనుసంధానం చేసే రోడ్లు, నీటి నిల్వ కుంటలు, భూ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకం, చెరువుల అభివృద్ధి లాంటి పనులను ఎంపిక చేసింది. కూలీలకు రూ.699.09 కోట్లు, మెటీరియల్ కోసం రూ. 157.60 కోట్లు ఖర్చుచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

అడిగిన వారందరికీ పనులు



జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకీ ఉపాధి హామీ పథకం కింద పని కల్పించేందుకు ముందస్తు ప్రణాళిక చేపట్టాం. ఉన్న ఊళ్లోనే పనులు కల్పిస్తాం. మెటీరిల్ కంటే కూలీల సంక్షేమానికే రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వచ్చే ఏడాది లోటును భర్తీ చేస్తూ కూలీలందరికీ న్యాయం చేసేలా ప్రయత్నిస్తున్నాం. రైతులు, ప్రజల అవసరాల మేరకే పనులు ఎంపిక చేపట్టి పూర్తిచేసేలా బడ్జెట్‌లో రూపకల్పన చేశాం.

– వేణుగోపాల్‌రెడ్డి, పీడీ, డ్వామా

క్లుప్తంగా

జేవీఎంఆర్డీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్


తాడిమర్రి: మండలంలోని నార్పింపల్లిలో విశ్రాంత డీజీపీ జేవీ రాముడు స్థాపించిన జాస్తి వెంకట్రాముడు రూరల్ డెవలప్‌మెంట్ (జేవీఎంఆర్డీ) పాఠశాలను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ బుధవారం సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు హరితో పాఠశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న ఆకాంక్షతో విశ్రాంత డీజీపీ జేవీ రాముడు ఈ పాఠశాలను స్థాపించారని హెచ్ఎం హరి వివరించారు. నామమాత్రపు ఫీజులు తీసుకుని నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుతో పాటు శుద్ధ జలాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ ఆరో తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ కృష్ణమోహన్ ఉన్నారు.

అరసం రాష్ట్ర మహాసభలకు తరలిరండి

అనంతపురం కల్చరల్: ఏపీ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 11, 12 తేదీలలో గుంటూరు జిల్లా తెనాలిలో జరుగుతాయని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటూ పుస్తకావిష్కరణలు, మేథోపరమైన చర్చలు, నూతన కార్యవర్గ ఎన్నిక ఉంటాయని వెల్లడించారు. అనంత రచయితలు, కవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డిజిటల్ తరగతులకు దన్ను

- 700 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలకు రూ.6.40 లక్షల గ్రాంటు
- ఉమ్మడి జిల్లాలో 957 స్మార్ట్ తరగతుల ఏర్పాటుకు చర్యలు



అనంతపురం: ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), డిజిటల్ ఇన్షియేటివ్స్‌లో భాగంగా ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు నిర్వహించనున్నారు. ఐసీటీ, స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటుకు సమగ్ర శిక్ష దన్నుగా నిలుస్తోంది. విద్యారంగంలో ఇప్పటికే విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అంతర్జాతీయ విద్యనందిస్తోంది. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు సైతం భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు అందుకునేలా డిజిటల్ విద్యను వారికి చేరువ చేస్తోంది. ఆధునిక సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని విద్యార్థులను అన్ని విషయాల్లో మేటిగా తీర్చిదిద్దుతోంది. ఈ క్రమంలో దశల వారీగా ఫౌండేషన్ స్కూల్ స్థాయి నుంచి ఇంటర్మీడియెట్ స్థాయి అయిన హైస్కూల్ ప్లస్ స్కూళ్ల వరకు డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే అత్యున్నత ప్రమాణాలు ఉన్న సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సీబీఎస్ఈ బోధనకు అనుగుణంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) డిజిటల్ కంటెంట్‌ను ఇప్పటికే సిద్ధం చేసింది.

అడ్మిషన్ల ఆధారంగా స్మార్ట్ తరగతులు

2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్ల ఆధారంగా స్మార్ట్ తరగతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పాఠశాలలో 100లోపు విద్యార్థులు ఉంటే రూ.2.5 లక్షలు, 100 నుంచి 250 మందిలోపు ఉంటే రూ.4.50 లక్షలు, 250 నుంచి 700 మంది ఉంటే రూ.6.4 లక్షల గ్రాంట్‌ను ప్రభుత్వం అందజేస్తుంది. వచ్చే 5 సంవత్సరాల్లో ఈ గ్రాంట్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,061 ఐసీటీ ల్యాబ్‌ల ఏర్పాటుకు అనుమతులు రాగా, ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 957 ఐసీటీ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ల్యాబ్‌లు పూర్తిగా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి. వైఫై, హెచ్‌డీఎంఐ, యూఎస్‌బీ, వీజే కనెక్టివిటీ, రికార్డెడ్ బోర్డు వర్క్, డిజిటల్ బోర్డును బ్లాక్ లేదా గ్రీన్ బోర్డులుగా మార్చుకోవడానికి అవకాశం, ఆడియో, వీడియోలు ప్రదర్శనకు వీలు, ప్యానల్‌లోనే స్పీకర్ల ఏర్పాటు, స్పెసిఫికేషన్ల ఇంటెల్ కోర్ ఐ–5, ఏఎండీ రీజెన్5 ప్రాసెసర్, కంప్యూటర్లు ఏర్పాటు చేయనున్నారు.

నాడు–నేడు బడుల్లో చకచకా ఏర్పాట్లు

మనబడి 'నాడు – నేడు' కింద తొలి దశ పనులు పూర్తయిన స్కూళ్లలో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి డిజిటల్ బోధన చేస్తారు. ఇందులో భాగంగానే స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. 65 ఇంచులతో ఉండే 1,463 స్మార్ట్ టీవీలను ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. డిజిటల్ తరగతులకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు.

డిజిటల్ కంటెంట్ సిద్ధం

డిజిటల్ విద్యాబోధనకు వీలుగా విద్యాశాఖ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు డిజిటల్ కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్న నేపథ్యంలో విద్యాశాఖ సిలబస్‌కు అనుగుణంగా మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఈ –కంటెంట్‌ను సీబీఎస్ఈ విధానంలో రూపొందిస్తోంది. వీటిలో ఆడియో, వీడియో తరహాలో కంటెంట్ ఉండనుంది.

స్మార్ట్ తరగతులకు చర్యలు

మన బడి 'నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా స్మార్ట్ తరగతులు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. తక్కిన వాటిలో కొత్తగా ఇన్ఫర్మేషన్ కంప్యూటర్ టెక్నాలజీ, స్మార్ట్ తరగతుల ఏర్పాటుకు సంబంధించి సమగ్రశిక్ష విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,061 ఐసీటీ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఇపుడు ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి ఉమ్మడి అనంతపురం జిల్లాకు 957 స్మార్ట్ తరగతులు రానున్నాయి.

– బి.ప్రతాప్‌రెడ్డి, ఆర్జేడీ, విద్యాశాఖ

సీమను నిర్లక్ష్యం చేస్తే వేర్పాటు వాదం తప్పదు

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ

అనంతపురం టవర్ క్లాక్: నవ్యాంధ్ర ప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలు ఏకకాలంలో సమానంగా అభివృద్ధి చెందకపోతే ఏర్పాటు వేర్పాటు వాద ఉద్యమం తప్పదని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. అనంతపురంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెడితే న్యాయస్థానాల ద్వారా ప్రతిపక్ష టీడీపీ అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన సిద్ధేశ్వరం–సంగమేశ్వరం వద్ద కొత్తగా బ్యారేజ్ నిర్మించాలన్నారు. విభజన చట్టంలో తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నది నీటి అంశాల నిర్వహణ కోసం కర్నూలులో కృష్ణానది నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. దీని వలన నీటి సమస్యలు తలెత్తినప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు అనువుగా ఉంటుందన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి రాయలసీమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కడప స్టీల్‌ప్లాంట్, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సమితి ప్రతినిధులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కేపీ కుమార్, హనుమన్న, వెంకటేష్, బయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ బియ్యం అందాలి

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శోభారాణి



చోళసముద్రంలో మాట్లాడుతున్న డీఎస్ఓ శోభారాణి

కూడేరు: రేషన్ పంపిణీ వాహనాల (మొబైల్ డిస్పెంసింగ్ యూనిట్ – ఎండీయూ) ద్వారా ప్రతి ఇంటికీ రేషన్ బియ్యం సక్రమంగా అందజేయాలని ఎండీయూ ఆపరేటర్లను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్ఓ) శోభారాణి ఆదేశించారు. కూడేరు మండలం మరుట్ల, చోళసముద్రం, పి.నారాయణపురం గ్రామాల్లో ఎండీయూ ద్వారా చేపట్టిన రేషన్ పంపిణీని ఆమె బుధవారం పరిశీలించారు. సరుకుల పంపిణీ, వాహన నిర్వహణపై ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె వెంట సీఎస్‌డీటీ లక్ష్మీదేవి ఉన్నారు.

లోకేశ్‌ది పాదయాత్ర కాదు... టీడీపీ పాడె యాత్ర

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

తాడిపత్రి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టింది పాదయాత్ర కాదని.. అది టీడీపీ పాడె (శవ) యాత్ర అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజాసంక్షేమ యాత్ర ముగింపు సందర్భంగా సంఘీభావం తెలిపేందుకు బుధవారం పెద్దవడుగూరుకు వచ్చిన ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కనీసం వార్డు మెంబరుగా కూడా గెలవలేని వ్యక్తి ఏ అజెండా లేకుండా పాదయాత్ర చేపట్టి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌ను ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. అందుకే యువగళం పేరుతో సాగిస్తున్న పాదయాత్రలో లోకేష్ వెంట కనీసం వంద మంది కూడా లేరన్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటు ద్వారా ప్రజలు టీడీపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి గురించి తనకు ఎక్కువగా తెలియదని, అయితే మంచీమర్యాద, సంస్కారం తెలియని ఓ వ్యక్తిగా మాత్రం తెలుసునన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి అన్నారు. ప్రజలకు మంచి చేసేవారినే నాయకుడిగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

పరిశ్రమల స్థాపనే ప్రభుత్వ లక్ష్యం

- అవగాహన సదస్సులో జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖరరెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖరరెడ్డి

యాడికి: చిన్న, మధ్య తరహాతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి సూచించారు. పరిశ్రమల ఏర్పాటు అంశంపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏడీ రాజశేఖరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం పలు రాయితీలను అందజేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన రైస్‌మిల్లు, కోల్డ్ స్టోరేజీ ప్లాంటు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్, గ్రౌండ్‌నట్ డెకార్టికేటర్, ఖనిజ ఆధారిత పరిశ్రమలైన సిమెంట్, ఫ్లైయాస్ ఇటుకల తయారీ, హైడ్రేటెడ్ సున్నం, పైపులు, సిమెంటు రేకులు, స్టోన్ పాలిసింగ్, క్రషర్, పల్వరైజింగ్ ఆఫ్ మినరల్స్, గ్రానైట్ కటింగ్ – పాలిసింగ్, పశు సంపద ఆధారిత పరిశ్రమలైన పాల ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమలైన రెడిమేడ్ దుస్తులు, జీన్స్ ప్యాంట్లు, ఆటోమొబైల్, బొరుగుల బట్టీ వంటి వాటిని స్థాపించుకుంటే స్వయం ఉపాధితో పాటు మరో పది మందికి జీవనోపాధి కల్పించినట్లవుతుందన్నారు. ఆ దిశగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పరిశ్రమల అధికారి ఐజయ్య పాల్గొన్నారు.

వసివాడనిది 'వసీరా' కవిత్వం

- రాధేయ అవార్డుకు ఎంపికైన 'సెల్ఫీ' కవితా సంపుటి



వసీరా 'సెల్ఫీ' కవితా సంపుటి



వసీరా

అనంతపురం కల్చరల్: 'కాళ్లు తడవకుండా సముద్రాన్ని దాటిన మేధావి కూడా.. కళ్లు తడవకుండా జీవితాన్ని దాటలేడు' ఈ పంక్తులు చాలు వసీరా కవిత్వం పాఠకుని హృదయాన్ని ఎంతగా కదిలిస్తుందో చెప్పడానికి. సిరా చుక్కలనే అస్త్రాలుగా అక్షరాలతో విన్యాసాలు చేయిస్తూ గొప్ప భావకవిగా పేరొందిన వసీరా ఏ యేడు ప్రతిష్టాత్మక సత్యరాధేయ కవితా పురస్కారానికి ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన వక్కలంక సీతారామారావు (వసీరా) హైదరాబాదులో స్థిరపడ్డారు. నాలుగు దశాబ్దాలుగా 'వసీరా' అనే కలం పేరుతో కవితా యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు. సీనియర్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా రెండు పడవల ప్రయాణాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తున్న ఆయన కలం నుంచి 1986లో తొలి కవితా సంపుటి 'లోహనది', 1994లో 'మరోదశ' కవితా సంపుటాలు వచ్చాయి. తొలి కవితా సంపుటికే ప్రతిష్టాత్మక 'కుందుర్తి ఫ్రీవర్స్' అవార్డు దక్కింది. ఇందులోని 'దుఃఖం' కవితలో వసీరా మానవత్వాన్ని తట్టిలేపుతారు. 'దుఃఖానికి వీడ్కోలు చెప్తూ మళ్లీ ప్రయత్నించకేం..నువ్వే ఓడిపోతావు..కానీ సాటివాళ్లు కష్టాల్లో ఉన్నప్పుడు నేను మనిషినని గుర్తు చేయడానికి తప్పనిసరిగా నా దగ్గరికి రా' అంటూ దుఃఖాన్ని ఆహ్వానించిన 'వసీరా' ఎందరో ఆత్మీయులను కూడగట్టారు. అలాగే గరికపాటి అవార్డుకు ఎంపికై ప్రసిద్ధ కవి సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. భావుకత ఉట్టిపడేట్లు 2022లో 'సెల్ఫీ' కవితా సంపుటిని సాహితీ లోకం ముంగిటకు చేర్చారు.

పురస్కార ప్రతిష్ట పెరిగింది

'కవిత్వాన్ని ధ్యానం చేశాడో, ధ్యానాన్నే కవిత్వం చేశాడో మరి కానీ ధ్యానం దర్శనంలో పరవశించినపుడు ఆ దర్శనాలకు అక్షరరూపం కల్పిస్తే వసీరా 'సెల్ఫీ' కవితా సంపుటిగా మారింది'ని ఆ పుస్తకానికి ముందు మాట రాసిన సుప్రసిద్ధ కవి శివారెడ్డి పేర్కొన్నారు. ఈ కవితా సంపుటినే రాధేయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఉమ్మడి లిటరరీ ట్రస్టు ద్వారా అందిస్తున్న ఈ పురస్కారాన్ని త్వరలోనే అనంతపురంలో వసీరాకు అందిస్తామని నిర్వాహకులు డాక్టర్ రాధేయ తెలిపారు.

బీజేపీ కుట్ర సాగనివ్వం

- కర్ణాటక ఎన్నికల్లో గెలుపు కోసమే అడ్డగోలు నిర్ణయాలు
- అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ ఎడారే
- పోరుబాటకు సిద్ధం కావాలన్న ప్రజాసంఘాలు



సంఘీభావం తెలుపుతున్న రాజకీయ, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణి వల్ల ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలోని ఎగువ భద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు వాటిల్లే ప్రమాదంపై జెడ్పీ సమావేశ మందిరంలో సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ.. టీబీ డ్యామ్‌కు ఎగువన అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పిస్తూ రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు. కేవలం కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుయుక్తితో రాయలసీమను బలి చేసే పన్నాగానికి బీజేపీ పెద్దలు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో రాయలసీమకు నీటి లభ్యత ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదముందన్నారు. రాయలసీమతోపాటు తెలంగాణలోని రాజోలి బండ ప్రాజెక్ట్, శ్రీశైలం డ్యాంకు సైతం నీరందే పరిస్థితి ఉండదన్నారు. రాయలసీమకు సాగునీరు అందితేనే పంటలు పండుతాయని, లేకపోతే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటికీ కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలు, ప్రజా, రైతు సంఘాలతోపాటు ఈ ప్రాంత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ నెల 13 నుంచి 24వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజామద్దతుతో పోరాటాలు సాగిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, రైతు సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అదనపు కట్నం వేధింపులపై అనంపురం దిశ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను దిశ సీఐ చిన్న గోవిందు వెల్లడించారు. ఉరవకొండకు చెందిన గన్నేరు సునీతకు 2008లో బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన హెద్దే రామచంద్రతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదనపు కట్నం కోసం సునీతను భర్త వేధిస్తున్నాడు. ఈ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో భరించలేని సునీత బుధవారం అనంతపురం దిశ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ అనంతరం ఆమె భర్త రామచంద్రపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మద్యం కొనుగోలుకు డబ్బు సమకూరకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం నివాసి గొల్ల గోపాల్ (35), అలివేలమ్మ దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. గోపాల్ మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ భారం మొత్తం అలివేలమ్మపై పడింది. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు అవసరమైన డబ్బు సమకూరకపోవడంతో మంగళవారం రాత్రి దాదాపు 11 గంటలకు గోపాల్ ఇంటి వెనుక చెట్టుకు తన పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సప్లిమెంటరీ అవకాశం కల్పించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ సెమిస్టర్, ఇయర్ వైజ్ విధానంలో చదువుతున్న విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం, ఎస్ఎఫ్ఐ, బీఎస్పీ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఒకటి, రెండు సబ్జెక్టులు ఫెయిలైన చాలామంది ఉన్నారని, సప్లిమెంటరీ విధానం ప్రవేశపెడితే డిగ్రీ సర్టిఫికెట్లు తీసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు పి.హేమంత్‌కుమార్, రజిని, చంద్రశేఖర్, సంజీవ్ నాయక్, రాజశేఖర్, పవన్, ప్రకాష్, మురళి, సుదర్శన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్, బీఎస్పీ నాయకులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులకు మెమోలు

అనంతపురం క్రైం: టౌన్ ప్లానింగ్ విభాగంలోని కీలక అధికారులందరికీ నగర పాలక సంస్థ కమిషనర్ కే భాగ్యలక్ష్మి మెమోలు జారీ చేశారు. బుధవారం ×సాక్షి₹ దినపత్రికలో ×ఆక్రమణలకు అడ్డుకట్ట ఏదీ?₹ శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. నగరంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీలకు మెమోలు జారీ చేశారు. అలాగే టౌన్ ప్లానింగ్ ఆర్‌డీ దేవికుమారి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా గొల్ల కిష్టప్ప

రామగిరి: భారతీయ జనతా పార్టీ శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గ సభ్యులుగా కొత్తగాదికుంట గ్రామానికి చెందిన గొల్ల కిష్టప్ప నియమితులయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డితోపాటు జిల్లా నాయకులు తనను ఎంపిక చేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంధులకు ‘అమ్మ’ చేయూత



అంధ కుటుంబాలకు సాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నిరుపేదలు, నిర్భాగ్యుల పట్ల అమ్మ సంస్థ నిర్వాహకులు మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆత్మకూరుకు చెందిన రెండు అంధ కుటుంబాల వారు అనంతకు చేరి కూలీనాలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే వయసు పైబడి శక్తి సన్నగిల్లడంతో పూట గడవడమే కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి స్పందించి వారికి చేయూతనందించారు. కాటమయ్య, లక్ష్మీనరసయ్య, లక్ష్మీదేవమ్మ, శారదమ్మ తదితరులకు రూ.40 వేల నగదు, మరో రూ.20 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులతో పాటు వారు నడవడానికి వీలుగా వాకర్స్‌ను అందజేశారు.

నీటి ఎద్దడి తలెత్తకూడదు



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

రాప్తాడురూరల్: వేసవిలో ఏ గ్రామంలోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విద్య, వ్యవసాయం, పండ్లతోటల పెంపకం, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు–మండల సమాఖ్య, స్త్రీ, శిశు సంక్షేమం, పశువైద్యం, డెయిరీ, ఉపాధి హామీ పథకం, విద్యుత్, గృహ నిర్మాణం, తాగునీరు, పరిశుభ్రత, పంచాయతీరాజ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, ఏఓ వెంకటేశ్వరప్రసాద్, ఎంఈఓ వెంకటస్వామి, వైకేపీ ఏపీఓ నల్లప్ప, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మీరే విజయ సారథులు

- ప్రభుత్వ మేలును ప్రజలకు వివరించండి
- ప్రతిపక్ష పార్టీ నేతల కుట్రలను తిప్పికొట్టండి
- జగనన్న కన్వీనర్లు, గృహసారథులకు ఎమ్మెల్యే అనంత దిశా నిర్దేశం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో పరిశీలకుడు వెంకటరెడ్డి యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా తదితరులు



హాజరైన జగనన్న కన్వీనర్లు, గృహ సారథులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వానికి వలంటీర్లు.. వైఎస్సార్‌సీపీకి జగనన్న వార్డు కన్వీనర్లు, గృహ సారథులే విజయ సారథులని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షం చేసే కుట్రలు, కుతంత్రాలను సమర్థంగా ఎదుర్కొని.. ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించి వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి వచ్చేందుకు బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన జగనన్న వార్డు కన్వీనర్లు, గృహ సారథులకు బుధవారం కేటీఆర్ ఫంక్షన్ హాలులో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కన్వీనర్లు, గృహ సారథుల బాధ్యతలపై వీడియో రూపంలో వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరెడ్డియాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఎమ్మెల్యే అనంత మాట్లాడారు. ‘మా నమ్మకం మీరే జగనన్న’ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించాలన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. కుట్రలు చేసైనా సరే నేడు మరోసారి అధికారంలోకి రావడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. టీడీపీ కుట్రలు, పన్నాగాలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు.

చేసేదే చెప్తారు.. చెప్పేదే చేస్తారు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏదైనా చెప్పే చేస్తారని, చేసేదే చెప్తారని ప్రజల్లో నమ్మకం ఏర్పడిందని ఎమ్మెల్యే అనంత అన్నారు. ఎన్నికల హామీల్లో ఇప్పటికే 98 శాతం పూర్తి చేసి ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, ప్రజా ప్రతినిధుల సిఫార్సు ఉంటేనే పథకాలు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరవుతున్నాయన్నారు. అయితే ఈ సంక్షేమ పాలనను ప్రతిపక్ష పార్టీ జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్రం దివాళా తీస్తోందంటూ ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత తేవాలని పచ్చ మీడియాతో కలిసి విషం చిమ్ముతున్నారని విమర్శించారు.

20 నుంచి ‘మా నమ్మకం నువ్వే జగనన్న’

ఈ నెల 20 నుంచి 27 వరకు ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ జగనన్న కన్వీనర్లు, గృహసారథులు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలో అందుతున్న సేవలు, అమలవుతున్న పథకాల గురించి తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే పారదర్శక సేవలు.. జనరంజక పాలన సాధ్యమయ్యిందనే విషయాన్ని వివరించాలన్నారు. నమ్మకానికి మారుపేరు జగన్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అర్బన్ నియోజకవర్గాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించామని, ఆయా క్లస్టర్లకు చింతా సోమశేఖరరెడ్డి, లక్ష్మన్న, చింతకుంట మధు, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డిలను ఇన్‌చార్జ్‌గా నియమించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో వారే పూర్తి బాధ్యతను తీసుకుని పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, నాయకులు బీసీ రమేష్‌గౌడ్, శ్రీదేవి, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, మాజీ మేయర్ రాగే పరుశురాం, మార్కెట్‌యార్డు డైరెక్టర్ గోవిందు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణవేణి, భారతి, కుళ్లాయిస్వామి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న విద్యా సంస్థల బంద్

అనంతపురం టవర్‌క్లాక్: కార్పొరేట్ కళాశాలల తీరును నిరసిస్తూ ఈ నెల 10న విద్యాసంస్థలను బంద్ చేయనున్నట్లు ఎన్ఎస్‌యూఐ నగర అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫీజుల కోసం ఒత్తిడి చేయడంతో నారాయణ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. అధిక ఫీజులు, విద్యార్థులపై వేధింపులను నిరసిస్తూ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

అనంతపురం క్రైం: నగరంలోని 45, 48 వార్డు సచివాలయాలను నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రీ సర్వేకు సంబంధించి ఫారం- 16ఏ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ, నిర్వహణపై ఆరా తీశారు. 1, 2, 3, 4, 5 రోడ్లలో ఇంటి, నీటి పన్ను చెల్లింపులపై సిబ్బందితో మాట్లాడారు. పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. మధ్యాహ్నం బీఎల్ఓలతో సమావేశమై.. ఓటరు–ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

కాశీవిశ్వేశ్వరుని హుండీ లెక్కింపు రేపు

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రాచీన కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శివరాత్రి పర్వదినాలకు ముందు సాగే హుండీ లెక్కింపు శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సుధారాణి తెలిపారు. ఎండోమెంటు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులందరూ ఈ ప్రక్రియలో పాల్గొంటారన్నారు. అలాగే గురువారం సాయంత్రం సామూహిక సంకష్టహర వ్రతాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని సూచించారు.

‘వైఎస్సార్ సీపీతోనే ముస్లింల ఆత్మగౌరవం’



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముస్లింల ఆత్మగౌరవాన్ని నిలిపిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించారన్నారు. ఆయన బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజకీయ పదవులను కట్టబెట్టి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించారన్నారు. ఐదుగురు ముస్లింలకు ఎమ్మెల్యేలుగా, ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. టీడీపీ హయాంలో ముస్లింలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు టోపీలు వేసుకుని.. ఫొటోలు దిగి ముస్లింలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప ఎమ్మెల్యే సీటును తన మామకు కాకుండా అంజాద్ బాషాకు కేటాయించి ముస్లింలపై ప్రేమను చాటుకోగా..అదే చంద్రబాబు హిందూపురం సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీని కాదని బావమరిది బాలకృష్ణకు ఇచ్చుకున్నారన్నారు. దీన్నిబట్టే ముస్లింలపై ఎవరికి ప్రేమ ఉందో స్పష్టమవుతోందన్నారు. ముస్లింలు ఎప్పటికీ జగన్ వెంటే ఉంటారని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, సభ్యులు ఖమర్‌తాజ్, మీరాబాషా, ఉరవకొండ మండల కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు కువైట్ ఖాదర్‌బాషా, గఫార్, బ్యాటరీస్ జాకీర్‌అహమ్మద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

‘నారాయణ’పై కేసులు నమోదు చేయాలి



ఆర్ఐఓకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

అనంతపురం: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను వేధిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్ఐఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో భవ్యశ్రీ అనే ఎంపీసీ రెండో సంవత్సర విద్యార్థిని రూ.12 వేల కాలేజీ ఫీజు, రూ.820 రికార్డ్ ఫీజు చెల్లించలేదని ఇబ్బంది పెట్టారన్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయడానికి అవకాశం కల్పిస్తామనడంతో రూ.10 వేలు చెల్లించారన్నారు. కేవలం రూ.2,820 పెండింగ్ ఉన్నప్పటికీ ప్రతి రోజూ విద్యార్థినిని అందరి ముందు ఫీజు అడిగి వేధించారన్నారు. దీంతో మనస్తాపానికి గురై రెండు రోజుల క్రితం కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిందని గుర్తు చేశారు. కళాశాల భవనం మెట్లు ఎక్కుతున్నప్పటికీ కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయకుండా నిర్వాహకులు కర్కశంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఇందుకు బాధ్యులైన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐఓ సురేష్‌బాబుకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకుడు సురేష్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు బిందు సేద్య పరికరాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి: వ్యవసాయ పరికరాలపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ వెంకటరాముడు సూచించారు. బుధవారం మండలంలోని యలకుంట్ల గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు మంజూరైన సబ్సిడీ బిందు సేద్య పరికరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా రైతులకు 70 నుంచి 90 శాతం సబ్సిడీతో బిందు, తుంపర సేద్య పరికరాలను అందజేస్తున్నారన్నారు. బిందు సేద్య పరికరాలు కావలసిన రైతులు స్థానిక ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటే అధికారులు పొలాల వద్దకే వచ్చి పరికరాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధికారి ప్రకాష్, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిపుణుడికి సత్కారం



రామాంజనేయులును సన్మానిస్తున్న ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి సైబర్ నేరాల దర్యాప్తుపై వారం రోజులుగా మెలకువలు నేర్పిన హైదరాబాద్ నిపుణుడు రామాంజనేయులును ఎస్పీ ఫక్కీరప్ప బుధవారం తన చాంబర్‌లో సత్కరించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు దోహదపడే మెలకువలను వర్చువల్ మీటింగ్‌ల ద్వారా జిల్లా పోలీసులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

కరెంటు స్తంభం ధ్వంసం

రాప్తాడురూరల్: అనంతపురం మండలం కురుగుంట సమీపంలోని జగనన్న కాలనీలో పనులు చేస్తున్న జేసీబీ వాహనం ప్రమాదవశాత్తూ తగలడంతో కరెంటు స్తంభం ధ్వంసమైంది. మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం సమాచారం అందుకున్న అధికారులు సంఘటన స్థలానికి వచ్చి కరెంటు సరఫరా ఆపేశారు. అంతవరకు బాగానే ఉంది. తిరిగి పునరుద్ధరించే చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా ధ్వంసమైన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి, ఆ తర్వాత స్తంభం దెబ్బతినడానికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు. అవసరమైతే కేసు కూడా పెట్టొచ్చు. అలా చేయకుండా స్తంభం విరిగిపోవడానికి కారణమైన వారు వచ్చి కొత్త స్తంభం ఏర్పాటుకు డబ్బులు చెల్లిస్తేనే కరెంటు సరఫరాను పునరుద్ధరిస్తామంటూ లైన్‌మెన్ చెబుతున్నాడని స్థానికులు వాపోతున్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చూడాలని ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని వడుపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తే రోజు కూలీ రూ.255 వస్తుందన్నారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పనులకు వచ్చేందుకు ముందుకు వచ్చేవారికి జాబ్‌కార్డు లేకపోతే వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు సుజాత, పుష్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీసీఐ మూతకు కేంద్రం కుట్ర

అనంతపురం అర్బన్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మూసివేత దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఏపీ రైతు సంఘం (సీపీఎం అనుబంధం) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ చర్యను పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై కక్ష కట్టినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా నిధులు తగ్గించిందన్నారు. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, పంటను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఒకవైపు రైతులు కోరుతుంటే.. ఇందుకు భిన్నంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. బడ్జెట్‌లో సీసీఐకి కేవలం రూ.లక్ష కేటాయించడం చూస్తుంటే ఆ సంస్థను మూసివేసేందుకు కుట్ర చేస్తోందనే విషయం స్పష్టమవుతోందన్నారు. సీసీఐతో పాటు ఫుడ్ కార్పొరేషన్ వంటి సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలు రైతులను దోపిడీ చేసేందుకు వీలు కల్పించేలా కేంద్రం చర్యలు ఉన్నాయన్నారు.

అన్నదాతలకు అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న ఏఓ వెంకటేశ్వర ప్రసాద్

ఆత్మకూరు: పంటల సాగులో రైతులకు నష్టాలు రాకుండా తగిన సహకారం అందించేందుకు అందరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సంచాలకులు భానుజ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తలుపూరు రైతు భరోసా కేంద్రంలో రైతు ఆత్మహత్యలు నిరోధించడం కోసం ‘జీవనరేఖ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు...రైతులతో ముఖాముఖి నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. పంట నష్టపరిహారాలు, రైతు భరోసా నగదు, ప్రభుత్వం నుంచి అందే పథకాల గురించి తెలియజేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు ధైర్యం కోల్పోకూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, ఏఈఓ విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఓబులేసు, ఎంపీఈఓ భారతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పేటెంట్ దక్కడంపై ప్రశంసలు



ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు దంపతులను సన్మానిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రొఫెసర్ వైశాలి జి.గోర్పడేలు ×మెథడ్ ఫర్ ప్రిపరేషన్ ఆఫ్ బ్యాక్టీరియల్ కాంక్రీట్ విత్ సెల్ఫ్ హీలింగ్ ఎబిలిటీస్ అండ్ ప్రాడక్ట్స్ దేర్ ఆఫ్₹ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఇండియన్ పేటెంట్ దక్కింది. ఈ సందర్భంగా వీరిని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న అభినందించారు. పేటెంట్ మంజూరు కావడం యూనివర్సిటీకే గర్వకారణమన్నారు. సాధారణంగా కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉంటుంది. దీనివల్ల కాంక్రీట్ దెబ్బతింటుంది. బ్యాక్టీరియల్ కాంక్రీట్ విధానంతో పగుళ్లు ఏర్పడకుండా నివారించడమే కాకుండా దీర్ఘకాలం మన్నిక వచ్చేలా చేసిన పరిశోధనకు ఇండియన్ పేటెంట్ దక్కడంతో ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రొఫెసర్ వైశాలి జి.గోర్పడే దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. కేశవరెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ ఎ.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

52 వాహనాల వేలం

రామగిరి: కర్ణాటక మద్యాన్ని అక్రమ తరలిస్తూ పట్టుబడిన 54 ద్విచక్రవాహనాలను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలంపాట నిర్వహించారు. రెండు వాహనాలను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని పక్కన పెట్టారు. మిగతా 52 వాహనాలకు అధికారులు కనీస ధర రూ.4,97,000 నిర్ణయించగా, వేలంపాటలో రూ.5,75,000 వచ్చిందని ఎస్ఐ జనార్ధన్‌నాయుడు తెలిపారు. వేలంపాటలో వాహనాలు దక్కించుకున్న వారు జీఎస్టీ రూపంలో మరో రూ.1,03,500 చెల్లించారని, మొత్తంగా వేలంపాటలో ప్రభుత్వానికి రూ.6,78, 500 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ‘సెబ్’ సీఐ, ఎస్ఐలతోపాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలి



కనగానపల్లి: మొబైల్ ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

కనగానపల్లి: విద్యార్థులతో పాటు పదేళ్ల క్రితం ఆధార్ తీసుకున్న వారంతా వివరాలు మరోసారి అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయించామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం తగరకుంట జెడ్పీ పాఠశాలలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ తనిఖీ

రామగిరి: మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను బుధవారం ఎంపీడీఓ ఆజాద్ తనిఖీ చేశారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని ఆధార్ కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు స్థానిక సచివాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల(ఎంఎల్‌హెచ్‌పీల)కు ప్రత్యేక శిక్షణ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్ కారణాలపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ యుగంధర్ తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన చికిత్సలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఎంఎల్‌హెచ్‌పీలకు సూచించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

రాప్తాడు: విధుల్లో అలసత్వం వహించే సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సాల్మన్ హెచ్చరించారు. కొందరు ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారు పద్ధతి మార్చుకోవాలన్నారు. బుధవారం ఆయన మండలంలోని ప్రసన్నాయపల్లి సచివాలయం-1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సచివాలయ ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు హాజరవుతూ బయోమెట్రిక్ వేయాలన్నారు. క్యాంపులకు వెళ్లే వారు తప్పకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూసే బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లపై ఉందన్నారు.